సాక్షి
పెద్దపల్లి
ఆదివారం । 30 । మార్చి । 2025

నవ విశ్వాసం

- నేడు విశ్వావసునామ ఉగాది పర్వదినం
- ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణాలకు ఆలయాలు సిద్ధం



తీపి, చేదు జ్ఞాపకాల క్రోధి నామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. వనాలన్నీ చిగురించే వేళ, పూల పరిమళాలు వెదజల్లే వేళ.. కోయిలమ్మల కుహూకుహూ రాగాలు.. హాయినిచ్చే వెచ్చని గాలులు.. వెలుగులు పంచే విశ్వావసునామ తెలుగు సంవత్సరానికి ప్రజలు ఆదివారం స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. వసంత రుతువు ఆగమనంతో చైత్రశుద్ధ పాడ్యమి సూర్యోదయం నుంచి తెలుగు నూతన సంవత్సర ఉగాది జరుపుకోవడం ఆనవాయితీ. ఉగాది అంటే కష్టసుఖాల కలయిక. షడ్రుచుల వేడుక. నూతన వస్త్రధారణ, ఆలయాల సందర్శన, ఇష్టదైవాల ఆరాధనతోపాటు.. పంచాంగ శ్రవణాలు, పిండి వంటల తయారీ ప్రత్యేకం. నేడు విశ్వావసునామ సంవత్సరం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పండితులు, కవులు, అలనాటి వేడుకలు, మారిన కాలంలో ఉగాది ఉషస్సుల ప్రత్యేకతలపై కథనం..

పంటలు సమృద్ధిగా..

మంథని: విశ్వావసు నామ సంవత్సరంలో పంటలు సమృద్ధిగా పండే అవకాశం ఉంది. పత్తి, వరి, తెల్లజొన్నలు వంటి పంటలు ఎక్కువగా లాభాలనిస్తాయి. పాలకుల మధ్య విభేదాలతో ప్రజలకు కొంత అసౌకర్యం కలుగుతుంది. అయినా ప్రజల్లో స్నేహభావంతో మేలు పెరుగుతుంది. భయాందోళనకర వాతావరణం ఉన్నా భగవతారాధన వల్ల అందరూ సుభిక్షంగా ఉంటారు. బంగారం, లోహ సంబంధిత వస్తువుల ధరలు అందుబాటులో ఉండే అవకాశం ఉంది.

– వొజ్జల గణేశ్ అవధాని, వేద పండితుడు, మంథని

45 వసంతాలుగా..

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడిని. 45 ఏళ్ల నుంచి ఉగాది నాడు పంచాంగ శ్రవణం చదివి వినిపిస్తున్న. విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలు ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతారు. ఆధ్యాత్మికత పెరుగుతుంది. సింగరేణి పారిశ్రామిక ప్రాంతంలో కార్మికులు, ఉద్యోగులు, అధికారుల మధ్య విశ్వాసం పెంపొందుతుంది. లోక కల్యాణార్థం యాగాలు, హోమాలు చేయడం జరుగుతుంది. రైతులు పంటలు అధికంగా పండిస్తారు.

– జగన్నాథచార్యులు, యైటింక్లయిన్‌కాలనీ

ఓదెల మల్లన్న సన్నిధిలో వాహన పూజలు

ఓదెల(పెద్దపల్లి): జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఉగాది పండుగ రోజున వాహనాల పూజలు నిర్వహిస్తుంటారు. ఉగాది రోజున వాహన పూజలు చేస్తే అంతా శుభం జరుగుతుందని భక్తులు నమ్ముతుంటారు. పండుగ రోజున మల్లన్న ఆలయం వాహనాల పూజలతో కిక్కిరిసిపోతుంది. పూజలకు వచ్చే భక్తుల కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.


ఉగాది ఉత్సవాలకు భక్తుల సౌకర్యార్థం వేసిన చలువ పందిళ్లు

- 8లో ▸

ప్రజాప్రయోజనాల కోసమే ఒకేచోట అన్ని కార్యాలయాలు

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు


మంథనిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతోనే ఒకేచోట సమీకృత ప్రభుత్వ కార్యాలయ భవనాలు నిర్మిస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. మంథని నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి శనివారం మంత్రి పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. పట్టణంలో ఆర్డీవో కార్యాలయంలోపాటు సుమారు 20 ప్రభుత్వ ఆఫీసులు ఒకేచోట ఉండేలా రూ.4.5 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులకు శంకుస్థాపన చేసినట్లు మంత్రి తెలిపారు. కమాన్‌పూర్, రామగిరి తహసీల్దార్ కార్యాలయాల భవనాలు ఒకేచోట ఉండేలా ప్లాన్ చేశామని ఆయన అన్నారు. రూ.30 లక్షలతో చేపట్టిన జెడ్పీ హైస్కూల్ రెనోవేషన్, రూ.35లక్షలతో చేపట్టిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, రూ.80 లక్షల వ్యయంతో చేపట్టిన మోడల్ స్కూల్ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఆర్డీవో సురేశ్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, అధికారులు పాల్గొన్నారు.

అధికారులు జవాబుదారీగా ఉండాలి

కమాన్‌పూర్/రామగిరి(మంథని): వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అధికారులు జవాబుదారీగా ఉండాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచించారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. స్థానిక శాఖ గ్రంథాలయానిన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రభుత్వ కార్యాలయాల సమీకృత భవన నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. ఉగాది పండుగ నుంచి పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తామని ఆయన అన్నారు. రాజాపూర్ గ్రామస్తులు ఆందోళన చెందవద్దని, అందరికీ అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు.

మైనార్టీలకు ప్రభుత్వం అండ : విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం(ధర్మపురి): కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలకు అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అభయం ఇచ్చారు. స్థానిక మసీదులో శనివారం నిర్వహించిన ఇఫ్తార్‌లో లక్ష్మణ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ఈద్గా అభివృద్ధి కోసం రూ.5లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండీ బాబా, ఎండీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్‌లో విప్ లక్ష్మణ్ తదితరులు

రుణమాఫీపై చర్చకు రండి : ఎమ్మెల్యే విజయ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్(పెద్దపల్లి) : రైతులను తప్పుదోవ పట్టించేందుకు రుణమాఫీ కాలేదని బీజేపీ, బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు అసత్య ప్రచారం చేస్తున్నారని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ జరిగిందని, అవసరమైతే దీనిపై చర్చించడానికి ఎక్కడికైనా రావడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆయన సవాల్ చేశారు. నాయకులు శ్రీనివాస్, అంతటి అన్నయ్యగౌడ్, మినుపాల ప్రకాశ్‌రావు, అధికారులు శ్రీమాల, వెంకటేశ్వర్లు, శశిధర్‌రావు, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

షడ్రుచుల సమ్మేళనం



గుర్రాన్నే కాదు.. స్వారీ చేస్తూ వచ్చిన
రాజుతో సహా నిర్లక్ష్యంగా నిలబెట్టే రారాజుల్లా..
విహారం చేసే సమయాన్ని మనమిప్పుడు
నిర్దయతో నిలబెట్టాలి
ఎడతెరిపి లేకుండా ఎంతసేపని నిలబడుతాం..
ఊపిరి బిగబట్టుకొని ఎంతని పరుగెడతాం..
ఈ పరుగు మనకోసమా.. మంది కోసమా
జవాబు తేల్చుకోవాలిప్పుడు

మామిడి ఆకుల్ని.. తీగదారుల్ని తాజాతాజా
పూవుల్ని.. ఇంట్లో లాగే మనసంతా
అలంకరించుకుంటూ హాయిగా గడిపేయాలి!
ఈ చిగుళ్ల మధ్య చిన్నారుల్లా..
ఆదమరిసి ఇలాగే ఉండిపోవాలి

అన్నీ మడిచి మనసంతా తుడిచి
ప్రకృతి లాగే మనమూ పచ్చని
శోభితులం కావాలి
రేపటి చెడు ఘడియల్ని ఒంటి చేత్తో ఎత్తేసి
శక్తిని షడ్రుషుల్లో మేళవించుకోవాలి
మనమిప్పుడు కవన రాగాలమై..
పవన మేఘాలమై..
అలాఅలా సంబరాల అలలమై పోవాలి..

ఇదంతా..
పంచాంగంలో పొంచ జన్యాన్ని స్ఫూరింపజేసు
కొని మళ్లీ మరెన్నో ఉగాది ఉషస్సులకేసి సాహస
ఉత్సాహాలతో సాగడం కోసమే సుమా..
– సేకరణ : గోదావరిఖనిటౌన్



నవ విశ్వాసం





- తరాలు మారుతున్నా.. తరగని సంప్రదాయం
- నాటి కట్టు, బొట్టుతో ఇష్టదైవాల ఆరాధన
- నేడు ఉగాది పండుగ

కాలాగమనంలో మరో తెలుగు సంవత్సరం గతించింది.. కొత్త ఆశలు.. సరికొత్త ఊసులతో విశ్వావసు నామసంవత్సరం ఆదివారం ఆరంభమవుతుంది. చీకటి వెలుగులున్న ప్రపంచంలాగే కష్టసుఖాల కలబోతగా మనిషి జీవితం సారూప్యతను కలిగి ఉంటుందనే నిజాన్ని ప్రతీకాత్మకంగా పట్టి చూపించేదే ఉగాది. తీపి చేదులతో పాటు షడ్రుచుల సమ్మేళనంతో కూడిన పచ్చడి సేవనం కూడా జీవితంలో ఆటుపోట్లను సమంగా స్వీకరించాలనే తాత్వికతను సంబోధిస్తుందీ పండుగ. ఇష్ట దైవాల ఆరాధనతో రాబోయే ఏడాదంతా సుఖ సంతోషాలను ప్రసాదించాలనే ఆకాంక్షతో ప్రజలు ప్రార్థన జరిపే పండుగ. కానీ.. మారిన కాలమాన పరిస్థితుల్లో పండుగల ప్రత్యేకత క్షీణిస్తోంది. పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా ప్రపంచీకరణ ప్రభావంతో 'సెల్' మాయాజాలంలో పండుగలు విశిష్టతను కోల్పోతున్నాయి. ఈనేపథ్యంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని పలువురు సంప్రదాయాలను పాటిస్తున్నారు. నాటి కట్టు, బొట్టుతో పండుగల విశిష్టతను కాపాడుతున్నారు. ఆదివారం విశ్వావసు ఉగాది సందర్భంగా ప్రత్యేక కథనం..!!

కొత్త బట్టలతో మురిసిపోయేటోళ్లం



మా సొంతూరు బెజ్జంకి దగ్గర దాచారం. నేను పుట్టక ముందే మా నాన్న సిరిసిల్లకు వచ్చాడు. నేను ఇక్కడే పుట్టాను. నా వయసు ఇప్పుడు 63 ఏళ్లు. మా చిన్నప్పుడు ఉగాది పండగ అంటే.. ఇంట్లో కొత్త బట్టలు కుట్టించేవాళ్లు. అవి వేసుకుని మురిసిపోతూ పంచాంగ శ్రవణం వినేవాళ్లం. ఉగాది పచ్చడి ఆకులల్ల పోసేటోళ్లు. ఎంతో సంతోషంగా అది తాగేటోళ్లం. ఇంట్లో పోలెలు చేస్తే.. ఇద్దరు అక్కలు, ఒక చెల్లె, అన్నతో కలిసి సంబురంగా తినేవాళ్లం. ఉగాది పండగ అంటే ఇంటిల్లిపాదికి ఎంతో ఆనందం ఉండేది.

– డాక్టర్ గాజుల బాలయ్య, విద్యానగర్, సిరిసిల్ల

ఊరంతా తిరిగి ఆడుకునేవాళ్లం



మా చిన్నతనంలో ఉగాది పండగ వచ్చిందంటే ఊరంతా తిరిగి ఆడుకునేవాళ్లం. కుడుకల పేర్లు, బచ్చీల పేర్లు మెడలో వేసుకుని సంబురంగా తిరిగేటోళ్లం. గుడికాడికి వెళ్లి పంచాంగం వినేటోళ్లం. ఇలా ఊరంతా అక్కడికి వచ్చి ఎంతో సంతోషంగా పండుగ జరుపుకునేది. ఇప్పుడు ఆ ఉత్సాహం లేదు.. ఉల్లాసం లేదు. ఏమైనా సెల్‌ఫోన్ చూస్తూ.. మనుషులు పరాయివాళ్లలాగే ఉంటున్నారు. మా రోజుల్లో ఉగాది పండగ అంటే ఏడాదికో దినం. పిల్లల అంతా కలిసి సంబురంగా ఆటలు ఆడేది.

– భానోత్ గన్యానాయక్, చిన్నబోనాల, సిరిసిల్ల

ఊరంతా పండుగే..



సిరిసిల్ల: వేములవాడ మండలం రుద్రవరం సొంతూరు. మా ఊరిలో ఉగాది పండగ రోజు ఊరంతా పండుగే. కుల, మత భేదాలు లేకుండా అందరూ పండుగ జరుపుకునేవారు. కాడెద్దులకు, కచ్చురాలకు జాజు పూసి, సున్నం బొట్లు పెట్టి వ్యవసాయ పనుల ప్రారంభోత్సవ పండగ చేసేవాళ్లం. పంచాంగ శ్రవణం విని ఏడాది పొడవునా వర్షాలు ఎలా ఉన్నాయి.. తదితర అంశాలపై ఆసక్తిగా చర్చించుకునే వాళ్లం. ఆ రోజులే వేరు.

– రేగులపాటి పాపారావు, మాజీ ఎమ్మెల్యే, సిరిసిల్ల

58 ఏళ్లుగా పంచాంగ పఠనం



ముస్తాబాద్(సిరిసిల్ల): ఉగాది పంచాంగ పఠనం 1967నుంచి చేస్తున్న. మా నాన్న గారు పరమపదించాక పౌరోహిత్యం చేపట్టాను. తెలుగు సంవత్సరాలు అరవై ఉండగా, మరో రెండేళ్లు గడిస్తే అన్ని సంవత్సరాలకు పఠనం చేసిన వ్యక్తిగా నిలుస్తా. ఆ రోజుల్లో ఉగాది రోజు మద్దికుంట శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి ఊరంతా వచ్చేవారు. పాడి, పంట, వర్షాలు, ఆదాయ వ్యయాలను రైతులు అడిగి తెలుసుకునేవారు. ఇప్పుడు సోషల్ మీడియాలో ముందుగానే తెలుసుకుంటున్నారు. నేను రైతుగా, ప్రజాప్రతినిధిగా, ఆలయ అర్చకులుగా గ్రామానికి విశిష్ట సేవలను అందించాను.

– మెట్టు రామశర్మ, మద్దికుంట, సిరిసిల్ల

ఆ ఉత్సాహమే లేదు



ఉగాది రోజున స్నానాలు చేసి పొద్దుగాలనే పొలంకాడికి పోయేవాళ్లం. వేపపువ్వు, మామిడికాయలు, మామిడి ఆకు, కొత్త చింతపండు తీసుకుని వచ్చి కొత్త కుండలో ఉగాది పచ్చడి చేసేవాళ్లు. కొబ్బరికాయ కొట్టి పచ్చడి పెట్టేదాకా ఇంట్లో నుంచి బయటకు వెళ్లకపోయేది. బక్ష్యాలు తిని వెళ్లి పంచాంగం వినేవాళ్లం. వచ్చే ఏడాదంతా ఎలా ఉంటుంది. ఏ రాశి వారికి రాబడి ఎంత.. ఖర్చు ఎంత..? తెలుసుకుని మురిసిపోయే వాళ్లం. ఈ రోజుల్లో ఆ ఉత్సాహమే లేదు.

– భైరి ప్రభాకర్, వెంకంపేట, సిరిసిల్ల

35 వసంతాలుగా..



గోదావరిఖనిటౌన్(రామగుండం): ఉగాది అనగా యుగానికి ఆది అని అర్థం. 35 ఏళ్లుగా పవర్‌హౌస్‌కాలనీలోని శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయంలో పంచాంగ శ్రవణం వినిపిస్తున్న. ఈ ఉగాది విశ్వావసు సంవత్సరం అనగా 11 మంది గంధర్వులలో విశ్వావసుడు ఒకరు. విశ్వవాసుడు ప్రేమకు ప్రతీతి. ప్రజల మధ్య ప్రేమానురాగాలను కలిగిస్తాడు. ఇది శుభ సంవత్సరం. ఒంటికి నూనె రాసుకొని తెల్లవారక ముందే స్నానం చేయడం వల్ల ఆరోగ్యం ప్రాప్తిస్తుంది. ఈ రోజు ధ్వజారోహణము చేసి, ఇంటిపై ధ్వజమును ఎగుర వేయాలి.

– వొజ్జల వెంకటేశ్వరశర్మ, గోదావరిఖని

కవిత్వం

విశ్వావసు ఆగమనమే



చైత్రమాసమే శోభితమై
మావిచిగురులే నూతనమై
వసంతరుతువు ముస్తాబై
కోయిల కుహు రాగాలతో
విశ్వావసుకు స్వాగతం
పలుకుతోంది
ఉగాది పండుగంటే
నిండైన పచ్చని తోరణాల
అందమైన వేదికలు
పంచాంగ శ్రవణం పండితులకు సత్కారం
శ్రోతల రాశిఫలాల కోసం
ఈ ఏడు జాతకానికి గడిచిన రోజులకు
రానున్న కాలానికి జరిగే గ్రహచారానికి
బేరీజు వేసుకుంటూ రోజంతా గడిపేరు
విశ్వావసు నామ ఉగాది
ఈ విశ్వావసు నామ ఉగాదికి
బంధుమిత్ర సమేతమై
ఉత్సాహంగా పండగ సందడి చేద్దాం..
ఈ విశ్వావసుకు స్వాగతం..సుస్వాగతం.

– బొమ్మిదేని రాజేశ్వరి, పెద్దపల్లి















వైభవంగా నూకాంబిక పోచమ్మ జాతర

రామగుండం: బర్మా, శ్రీలంక కాందిశీకుల ఆరాధ్యదైవమైన నూకాంబిక పోచమ్మ తల్లి జాతర శనివారం అంతర్గాం టీటీఎస్‌లో అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఉగాది పండుగకు ముందు వేడుకలు నిర్వహిస్తారు. అమావాస్య జాతరగా ఈ ఉత్సవం ప్రసిద్ధి గాంచింది. మనరాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లా అంతర్గాం టీటీఎస్‌లోనే ఈ జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లిలోనూ నూకాంబిక పోచమ్మ అమావాస్య జాతర నిర్వహిస్తారు. నూకాంబిక పోచమ్మ జాతర వైవిధ్యంగా ఉంటుంది. మాలాధారణ స్వాములు స్వీకరించే దీక్ష ఒళ్లు గగుర్పొడిచేలా ఉంటుంది. శూలాలు, ఘటాలు ఒంటిపై గుచ్చుకుని నిష్టతో పోచమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో అగ్నిగుండంలో నడిచి భక్తిని చాటుకున్నారు. తద్వారా తమ కోరికలు తీర్చాలని అమ్మవారిని వేడుకున్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్, అయోధ్యసింగ్, కౌశిక హరి, గెజిటెడ్ ఆఫీసర్స్ జిల్లా అధ్యక్షుడు తూమ్ రవీందర్‌పటేల్, జమ్ముల రామారావు, ఇండిబిల్లి రవీందర్, సింగం సత్తయ్యగౌడ్ తదితరులు హాజరయ్యారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని మార్కండేయకాలనీలోని రెండు ప్రముఖ ఆస్పత్రులను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి అన్న ప్రసన్నకుమారి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో ఒకటి సెల్లార్‌లో నిర్వహిస్తున్నారని, దీనికి రెన్యూవల్ చేయబోమని ఆమె తెలిపారు. సెల్లార్‌లోని ఆస్పత్రికి ఎలా అనుమతి పొందారని ప్రశ్నించారు. సెల్లార్ నుంచి మార్చకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరో ఆస్పత్రిలో రిజిస్టర్డ్ డాక్టర్ లేరని, కన్సల్టెంట్ డాక్టర్ అందుబాటులో ఉన్నారని, బెడ్ల మధ్య కనీస దూరం పాటించడం లేదని మండిపడ్డారు. ఆస్పత్రిలో అపరిశుభ్రత తాండవిస్తోందని పేర్కొన్నారు. పేషెంట్ల అపరిశుభ్ర వాతావరణంతో మరిన్ని అనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. కేస్‌షీట్లు సంపూర్ణంగా లేవని నిర్వాహకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాహకులకు నోటీసులు జారీచేస్తామని వెల్లడించారు. నిబంధనల మేరకే ఫీజు వసూలు చేయాలన్నారు. అగ్నిమాపక నిరోధక చర్యలు పాటించాలని సూచించారు. బయో మెడికల్ వేస్టేజ్‌ను నిబంధనల మేరకు డిస్పోజ్ చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్, అగ్నిమాపక నియంత్రణ తదితర ధ్రువీకరణపత్రాలతోపాటు డాక్టర్ల పేర్లు, సమయం, సేవల వివరాలు తెలియజేసే బోర్డులను రిసెప్షన్ కౌంటర్ ఎదుట ప్రదర్శించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

కులం పేరిట పరువు హత్య

ఎలిగేడు(పెద్దపల్లి): కులం, కట్టుబాట్ల పేరిట ఆధునిక సమాజంలోనూ ఇంకా పరువు హత్యలు చోటుచేసుకోవడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. ముప్పిరితోటలో గురువారం రాత్రి హత్యకు గురైన సాయికుమార్ తండ్రి పరుశరాములుగౌడ్, కుటుంబసభ్యులను ఆయన శనివారం కలుసుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమాజం ఆధునికతవైపు పరుగులు పెడుతోందని, ఇలాంటి సమాజంలో మూఢవిశ్వాసాలు, కట్టుబాట్లు, సంప్రదాయాల పేరిట ప్రేమించుకున్న పాపానికి సాయికుమార్‌ను హత్య చేయడం క్షమించరాని నేరమని తాము భావిస్తున్నామని అన్నారు. నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు కల్లేపల్లి అశోక్, మోదంపల్లి శ్రావణ్, ప్రశాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): గర్రెపల్లి గ్రామ సమీపంలోని పశువుల సంత రేకులషెడ్డులో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన పత్రి కళావతి(50) శనివారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లికి చెందిన నర్సయ్య – కళావతి భార్యాభర్తలు. ఈనెల 27న సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామానికి చేరుకున్నారు. భిక్షాటన చేశాక పశువుల సంతలోని రేకులషెడ్డు తలదాచుకుంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి భార్యాభర్తలిద్దరూ మద్యం తాగి పడుకున్నారు. శనివారం ఉదయం భర్త లేచి చూడగా.. ఎంతకీ నిద్రలేవలేదు. దీంతో ఆమె మృతి చెందిందని భావించి సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. మృతదేహంపై గాయాలు కనిపించాయి. అయితే, ఐదురోజుల క్రితం ద్విచక్రవాహనం పైనుంచి ఇద్దరూ పడిపోగా.. ఇద్దరికీ గాయాలయ్యాయని నర్సయ్య తెలిపాడు. మృతురాలి చిన్నకూతురు కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సెలవు దినాల్లోనూ ఆస్తిపన్ను స్వీకరణ

కోల్‌సిటీ(రామగుండం): ఆస్తిపన్ను బకాయిలపై ప్రకటించిన 90 శాతం వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకునేందుకు నగరవాసులు ముందుకు రావాలని బల్దియా అధికారులు సూచించారు. ఇందుకోసం ఆది, సోమవారాల్లో సెలవులు ఉన్నా.. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు యథావిధిగా పనిచేస్తాయని కమిషనర్(ఎఫ్ఏసీ) అరుణశ్రీ తెలిపారు. సిబ్బంది ఈ రెండురోజుల పాటు సేవలు అందిస్తారన్నారు. వడ్డీమాఫీ గడువు ఈనెల 31వ తేదీతో ముగియనున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

పెద్దపల్లిరూరల్: జిల్లాలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ అరుణశ్రీ, డీసీపీ కరుణాకర్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, కె.లక్ష్మీనారాయణ, కుత్రం నీలాదేవి, రేణిగుంట్ల ప్రవీణ్, జిల్లా శంకర్‌తో కలిసి శనివారం ఆయన సమీక్షించారు. వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, విద్య, వైద్యం, అందులో ఎస్సీలకు అందిస్తున్న సదుపాయాల గురించి కలెక్టర్ కోయ శ్రీహర్ష వివరించారు. అనంతరం బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. పెండింగ్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు సత్వరమే పరిష్కరించాలన్నారు. కోర్టుల్లోని పెండింగ్ కేసుల్లో తీర్పు వచ్చేలా సాక్ష్యులను ప్రవేశ పెట్టాలని అన్నారు. బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీస్ కేసులు, కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరులో తహసీల్దార్ ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఉపాధిహామీ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు 100శాతం పనిదినాలు కల్పించాలని, వేసవి దృష్ట్యా పనిప్రదేశాల్లో చల్లని తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వ శాఖల్లోని ఎస్సీ, ఎస్టీ అధికారులకు రోస్టర్ పాయింట్ ప్రకారం పదోన్నతులు కల్పించాలని కోరారు. హత్యకు గురైన ఎస్సీల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగం, పింఛన్, భూమి మంజూరు చేయాలని అన్నారు. గత ఐదేళ్లలో ఎస్సీ హత్య కేసుల్లో అందించిన పరిహారం వివరాలు తనకు నివేదించాలని సూచించారు. నెల రోజుల వ్యవధిలో పెండింగ్ పరిహారం, ఉద్యోగం, పింఛన్ మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిందితులను అరెస్టు చేయాల్సి ఉంటుందన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, పెద్దపల్లి, గోదావరిఖని ఏసీపీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరువు హత్య కేసులో నిందితుల అరెస్ట్

జూలపల్లి(పెద్దపల్లి): సంచలనం సృష్టించిన ఎలిగేడు మండలం ముప్పిరితోట పరువు హత్య కేసులో నిందితులను శనివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 27న రాత్రి ముప్పిరితోట గ్రామానికి చెందిన పూరెల్ల సాయికుమార్ (17)ను అదే గ్రామానికి చెందిన ముత్యం సదయ్య గొడ్డలితో నరికిచంపారని పేర్కొన్నారు. వద్దని చెప్పినా వినకుండా తన కూతురును ప్రేమిస్తున్నాడనే కోపంతో సదయ్య పథకం ప్రకారం.. సాయికుమార్‌ను పుట్టినరోజునే హత్యచేశాడని వివరించారు. ఈ కేసులో నిందితులు ముత్యం సదయ్యతోపాటు అతడి భార్య ముత్యం సమత, మరో నిందితుడు.. సదయ్య బావమరిది రంగాపురానికి చెందిన సిద్ధ సారయ్యను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చినట్లు సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, జూలపల్లి ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు.

సరిహద్దు పోలీసు అధికారుల భేటీ

గోదావరిఖని: అంతర్‌రాష్ట్ర పోలీసు అధికారులు శనివారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో భేటీ అయ్యారు. సీఈగా అంబర్ కిశోర్ ఝా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో భేటీ అయినట్లు తెలిసింది. మావోయిస్టుల ప్రాబల్యం, మాదకద్రవ్యాల సరఫరా, నేరాల కట్టడి తదితర అంశాలపై ఇందులో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. సరిహద్దు ప్రాంతాల్లోని చెక్‌పోస్టుల వద్ద పరిస్థితి, మావోయిస్టుల సమాచార సేకరణ తదితర అంశాలపై చర్చించారు. పోలీసు అధికారుల మధ్య సమన్వయం కోసం గతంలో నిర్వహించిన మాదిరిగానే ఈసమావేశం కొనసాగినట్లు సమాచారం. రాష్ట్రంలో మావోయిస్టు ప్రాబల్యం తగ్గినా.. పొరుగు రాష్ట్రాల్లో మావోయిస్టులపై నిర్బంధం పెరగడం, ఎన్‌కౌంటర్లు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోకి మావోయిస్టులు రాకుండా ఇందులో వ్యూహాలను రచించినట్లు సమాచారం. హెలిక్యాప్టర్‌లో వచ్చిన గడ్చిరోలి పోలీసులకు స్థానిక పోలీసు అధికారులు స్వాగతం పలికారు.

ఎన్టీపీసీ ప్లాంటులో హెల్మెట్ తప్పనిసరి

జ్యోతినగర్(రామగుండం): రామగుండం– తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టు ఆవరణలో ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించడంతోపాటు వెనాకల కూర్చున్న వ్యక్తి సైతం హెల్మెట్ ధరించాలని ఉత్తర్వులు విడుదల చేశారు. భద్రత నియమాల ఉల్లంఘనతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వివరించారు.

ముందస్తు చర్యలు తీసుకోవాలి

జూలపల్లి(పెద్దపల్లి): వేసవిలో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు.

బీఆర్‌ఎస్ నేతల ఇళ్లు ముట్టడిస్తాం

గోదావరిఖని: తమపై అసెంబ్లీలో అవమానకరంగా ప్రవర్తించిన బీఆర్‌ఎస్ నేతలు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో బీఆర్‌ఎస్ నాయకుల ఇళ్లు ముట్టడిస్తామని ట్రాన్స్‌జెండర్లు హెచ్చరించారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఫ్లెక్సీలకు శనివారం క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ, మంత్రి శ్రీధర్‌బాబు.. ట్రాన్స్‌జెండర్‌ల కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలపై అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతుండగా బీఆర్‌ఎస్ నేతలు అవమానకరంగా ప్రవర్తించారన్నారు.